# బాక్స్‌ల్లో భవితవ్యం!

- స్ట్రాంగ్ రూంలలోని ఈవీఎంలకు మూడంచెల భద్రత
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర పోలీసు నిఘా
- పార్టీల ప్రతినిధుల పరిశీలనకు ప్రత్యేక చర్యలు
- ఫలితాల కోసం జూన్ 4 వరకు ఆగాల్సిందే..



స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకుడు

మామిళ్లగూడెం, మే 14 : ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్ల నుంచి సోమవారం అర్ధరాత్రి పొన్నేకల్లులో గల శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరిన ఈవీఎంలను పటిష్ఠ బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర నిఘా నడుమ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. నెల రోజులపాటు నిరంతరం ప్రజలతో మమేకమై.. ఊరూరా.. వాడవాడలా విస్తృతంగా ప్రచారం చేసి.. ఓట్లు అభ్యర్థించిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. అంతేకాక ఈవీఎంలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా టీవీలను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక చర్యలు కూడా చేపట్టారు. అయితే ఎన్నికల ఫలితాల కోసం జూన్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే.

**విజయావకాశాలపై ఎవరి లెక్కలు వారివే..**

ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రమైన ఎండను లెక్క చేయకుండా గెలుపే ప్రధానంగా నిరంతరం శ్రమించారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎవరికి వారు తమ విజయావకాశాలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓటింగ్ సరళి, పట్టణ ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉండటం ఏ పార్టీకి లాభం.. నష్టం చేకూరుతుందో అనే అంచనాల్లో నిమగ్నమయ్యారు. మరో పక్క పందెంరాయుళ్లు మాత్రం గెలుపు ఓటములను బేరీజు వేస్తూ.. గెలిచినా మెజార్టీ వంటి అంశాలపై బెట్టింగ్‌లు కట్టే పనిలో తలమునకలయ్యారు.

**గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఓటింగ్**

నియోజకవర్గంలోని 1,896 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 7,87,160, మహిళలు 8,43,749, ట్రాన్స్‌జెండర్లు 130 మంది ఉన్నారు. అయితే సోమవారం జరిగిన పోలింగ్‌లో 12,41,135 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 6,05,969 మంది, స్త్రీలు 6,35,099, ట్రాన్స్‌జెండర్లు 67 మంది ఉన్నారు. మొత్తంగా 76.09 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి కూడా ఖమ్మం అసెంబ్లీ పరిధిలో 3,24,073 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 2,04,078 మంది మాత్రమే ఓటు వేయడంతో 62.97 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. దీని తర్వాత స్థానంలో కొత్తగూడెం అసెంబ్లీలో 2,47,494 మంది ఓటర్లు ఉన్నప్పటికి 1,71,928 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 69.47 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,40,806 మంది ఓటర్లు ఉండగా.. 2,01,721 మంది ఓటర్లు ఓటు వేశారు. 83.77 శాతం పోలింగ్ నమోదైంది. మధిర నియోజకవర్గంలో 2,22,160 మంది ఓటర్లు ఉంటే.. 1,81,815 మంది ఓటు వేశారు. 81.84 శాతం ఓటింగ్ నమోదైంది. వైరా నియోజకవర్గంలో 1,93,389 మంది ఓటర్లు ఉండగా.. 1,56,762 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.06 శాతం పోలింగ్ నమోదైంది. సత్తుపల్లి నియోజకవర్గంలో 2,43,943 మంది ఓటర్లు ఉంటే.. 1,95,979 మంది ఓట్లు వేయడంతో 80.34 శాతం పోలింగ్ నమోదైంది. అశ్వారావుపేట నియోజకవర్గంలో 1,59,174 మంది ఓటర్లకు.. 1,28,852 మంది ఓట్లు వేయడంతో 80.95 శాతం పోలింగ్ నమోదైంది. ఈ లెక్కల ప్రకారం అన్ని సెగ్మెంట్లలో గ్రామీణ ఓటింగ్ శాతం పెరడంతో అభ్యర్థులు ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు.

# స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

## ఖమ్మం పార్లమెంట్ ఆర్వో, కలెక్టర్ వీపీ గౌతమ్



స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అనంతరం భద్రతా సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 14 : స్ట్రాంగ్ రూంలకు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లకు సంబంధించి ఈవీఎంల తరలింపు ప్రక్రియ పూర్తయిందని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. రూరల్ మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంల తరలింపు ప్రక్రియను పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జీ కోల్టేతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట, అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ అర్ధరాత్రి వరకు తరలించి స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచామన్నారు. ఈ ప్రక్రియ అంతా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా జరిగిందన్నారు. ఈవీఎంలకు మూడంచెల భద్రత కల్పించామని, సీఆర్‌పీఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులు భద్రతగా నిరంతరం కాపలా ఉంటారన్నారు. స్ట్రాంగ్ రూంలకు అన్ని వైపులా సీసీ కెమెరాలు, టెర్రస్‌పై నైట్ విజన్ కెమెరాలు అమర్చామన్నారు. అంతరాయం లేకుండా సీసీ కెమెరాలు పని చేయడానికి పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లు వచ్చి టెలివిజన్‌లో సీసీ కెమెరాలను పరిశీలించవచ్చని, పాస్‌లు ఉన్నవారు మాత్రమే స్ట్రాంగ్ రూంల వద్దకు వెళ్లి పర్యవేక్షణ చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సహాయ ఎన్నికల అధికారులు ఆదర్శ్ సురభి, బీ.సత్యప్రసాద్, వేణుగోపాల్, ఎం.రాజేశ్వరి, గణేశ్, రాజేందర్, మధు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా రామయ్య పట్టాభిషేకం



స్వామివారిపై సముద్ర, నదీ జలాలను ప్రోక్షిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 14 : శ్రీరామ పునర్వసు దీక్షా విరమణను పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీరామ దీక్షితులతో రామయ్యకు పట్టాభిషేక కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించిన తర్వాత అదే వేదికపై పట్టాభిషేక మహోత్సవం జరిపారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్త రామదాసు తయారు చేయించిన దివ్యాభరణాలను ధరింపజేశారు. రాజముద్రిక, రాజ దండం, రాజ ఖడ్గం, ఛత్ర, చామరాలు తదితర రాజ చిహ్నాలను స్వామివారికి వేద మంత్రోచ్ఛారణల నడుమ అలంకరించారు. రామయ్య గుణగణాలు, శ్రీరామ రాజ్యం వైభవాన్ని వేద పండితులు వివరించారు. శ్రీరామ పట్టాభిషేకాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి శ్రీరామ దీక్షితులు భారీగా తరలివచ్చారు.'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' అంటూ స్వామివారిని తలుస్తూ భక్తిభావంతో భక్తులు చేసిన జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- ఖమ్మం జిల్లా ఓటర్లు చైతన్యవంతులు, విజ్ఞులు
- ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ కారు గుర్తుకే పడ్డాయి
- 'ఖమ్మం పార్లమెంటు' బీఆర్ఎస్ అభ్యర్థి నామా
- మంచి మెజార్టీతో గెలుస్తాం: ఎమ్మెల్సీ తాతా మధు
- ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు: వద్దిరాజు, సండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు

ఖమ్మం, మే 14: ఖమ్మం లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పార్టీ ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ప్రజలు చైతన్యవంతులని పేర్కొన్నారు. వారు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేశారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు మొత్తం బీఆర్ఎస్‌కే మళ్లిందని స్పష్టం చేశారు. మంచి మెజార్టీతో గెలుస్తానన్న నమ్మకం, విశ్వాసం తమకు ఉందని పేర్కొన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఏ గ్రామానికి వెళ్లినా కులమతాలకతీతంగా తనను ఆశీర్వదించి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. కేసీఆర్ రోడ్ షోకు కూడా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలిపారని అన్నారు. ఓట్లన్నీ నిశ్శబ్దంగా కారు గుర్తుకే ఓటు వేశారని అన్నారు.

**ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ బీఆర్ఎస్‌కే..**

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఈ ఆరు నెలల కాలంలో ప్రజలు తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు పడ్డారని, కరెంట్ కోతలను చూశారని అన్నారు. అందుకని ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ కారు గుర్తుకే పడినట్లు భావిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో తమకు అనుకూలంగా మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకంతో ఉన్నామన్నారు. అలాగే తాను విజయం సాధించేందుకు రేయింబవళ్లూ అహర్నిశలూ శ్రమించిన పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్‌స్థాయి శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

**మంచి మెజార్టీతో నామా గెలుస్తారు: తాతా మధు**

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి నామాకు ఓట్లు వేశారని అన్నారు. అలాగే, పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో పార్టీ అభ్యర్థి నామా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలో పర్యటించి శ్రేణుల్లో ఉత్సాహం నింపిన పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ నేత హరీశ్‌రావులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, కూరాకుల నాగభూషణం, బిచ్చాల తిరుమలరావు, పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణుగోపాల్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు దుర్మార్గం

### క్షతగాత్రులను పరామర్శించిన నామా, తాతా, వద్దిరాజు



గాయపడ్డ కార్యకర్తను పరామర్శిస్తున్న నామా, తాతా మధు, వద్దిరాజు తదితరులు

బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతల దాడులు దుర్మార్గమని బీఆర్ఎస్ నేతలు నామా నాగేశ్వరరావు, తాతా మధు, వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇలాంటి అమానుష దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను మంగళవారం వారు పరామర్శించారు. క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పార్లమెంటు ఎన్నికల వేళ తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లికి చెందిన తమ పార్టీ కార్యకర్తలు బండ్ల రమేశ్, వరిగడ్డి వీరబాబులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేశారని, ఈ దాడిలో రమేశ్, వీరబాబు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. ప్రశాంతమైన జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇలాంటి ఫ్యాక్షన్ రాజకీయలను ప్రోత్సహించడం సరికాదని స్పష్టం చేశారు. అనంతరం తమ కార్యకర్తలకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు.

# అతివలు అదుర్స్..

- భద్రాద్రి జిల్లాలో ఓటేసిన 3,58,744 మంది మహిళలు
- పార్లమెంట్ ఎన్నికల్లో వెల్లివిరిసిన మహిళా చైతన్యం
- కలెక్టర్ ప్రత్యేక చొరవతో కదిలొచ్చిన ఓటర్లు
- ప్రభావం చూపిన అవగాహన కార్యక్రమాలు
- పోలింగ్‌రోజు ప్రత్యేక మహిళా కేంద్రాలు



ఓటర్ల చైతన్యం కోసం మహిళలతో రన్ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, మే 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌లో మహిళా చైతన్యం వెల్లివిరిసింది. ఓటుహక్కుపై అవగాహన పెరగడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళా ఓటింగ్‌శాతం పెరిగింది. జిల్లావ్యాప్తంగా 5,08,550 మంది మహిళా ఓటర్లు ఉండగా 3,58,744 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాలతో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు సక్సెస్ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 4,79,626 మంది పురుష ఓటర్లు ఉండగా 3,47,461 మంది ఓట్లు వేశారు. ఒకచోట కాదు జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో ఓటర్లకు తగ్గట్టుగానే మహిళలు ఓటు వేసి చైతన్యాన్ని నింపారు. గత నెలరోజులుగా అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఓటింగ్‌పై మంచి ప్రభావం చూపాయని చెప్పవచ్చు.

**ఆదర్శంగా ఆడబిడ్డల ఓటింగ్..**

జిల్లాలో అధికసంఖ్యలో మహిళా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. జిల్లాలోని పినపాక నియోజకవర్గంలో పురుషులు 70,190 మంది ఓటు వేయగా మహిళలు 71,235 మంది ఓటు వేశారు. ఇల్లెందులో పురుషులు 78,112 మంది, మహిళలు 80,536 మంది, భద్రాచలంలో పురుషులు 51,386 మంది, మహిళలు 53,991 మంది, అశ్వారావుపేటలో పురుషులు 63,203 మంది, మహిళలు 65,643 మంది, కొత్తగూడెంలో పురుషులు 84,570 మంది, మహిళలు 87,339 మంది ఓటు వేసి సత్తా చాటుకున్నారు.

**ఓటుకు తరలివచ్చిన వృద్ధులు..**

ఓటుహక్కును వినియోగించుకోవడానికి వృద్ధులు సైతం తరలివచ్చారు. దీంతోపాటు హోం ఓటింగ్ కూడా కలిసొచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించడంతో వారు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉచిత ఆటోలు, ట్రై సైకిళ్లు పెట్టడం వల్ల ఇబ్బందులు లేకుండా ఓటు వేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా మహిళలు చైతన్యం చాటుకున్నారు.

## ప్రత్యేకంగా మహిళా పోలింగ్ కేంద్రాలు..

వందశాతం ఓటింగ్ జరగాలనే లక్ష్యంతో కలెక్టర్ ప్రియాంక ఆల పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించారు. భద్రాద్రి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు కలిసి ఉండడంతో అధికారులు సమన్వయంతో పనిచేశారు. 172 మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అంగన్‌వాడీ, ఐసీపీఎస్, ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అన్ని మండల కేంద్రాల్లో 2కే రన్‌లు, త్రీకే రన్‌లు ఏర్పాటు చేసి చైతన్యం కల్పించారు. దీంతోపాటు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి ఓటరుకు అవగాహన కల్పించారు. అన్నింటిలో మహిళలు ముందుండాలని చేసిన ప్రయత్నం సక్సెస్ అయినట్లు ఓటింగ్‌ను చూస్తే తెలుస్తుంది.

# అధికారుల పనితీరు భేష్

## భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం, మే 14 : మారుమూల ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ విజయవంతం కావడానికి కృషి చేసిన ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆర్డీవో, ఏఆర్‌వో దామోదరరావు, పోలింగ్ సిబ్బందిని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల ప్రత్యేకంగా ప్రశంసించారు. అధికారులందరూ సమష్టిగా, సమన్వయంతో పనిచేయడం బాగున్నదని మెచ్చుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తికాగానే సోమవారం రాత్రి సిబ్బంది తరలించి భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరిచిన పోలింగ్ సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక మండలాలైన చర్ల, దుమ్ముగూడెం పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ ప్రక్రియ ముగియగానే పోలీస్, సీఆర్పీఎఫ్ అధికారుల భద్రత నడుమ పోలింగ్ సామగ్రిని తెప్పించుకున్నామన్నారు. ప్రతి సెక్టార్‌కు పోలింగ్ స్టేషన్లను బట్టి సిబ్బందిని చేరవేసేందుకు రెండు బస్సుల చొప్పున కేటాయించామన్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు 844 మంది సిబ్బందిని పంపించామన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సామగ్రి, ఈవీఎం మిషన్లు, వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రి సరిగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించి.. బాక్స్‌లలో భద్రపరిచి మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు ప్రత్యేక భద్రత నడుమ పంపించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ ఎలక్షన్ మణిధర్, ఏఈవో వేల్పుల శ్రీనివాస్, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

- ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై కూలిన చెట్లు
- వాహనాల రాకపోకలకు అంతరాయం, పునరుద్ధరించిన పోలీసులు
- టేకులపల్లిలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు
- గోల్‌తండాలో కూలిన విద్యుత్ స్తంభాలు, విరిగిపడిన చెట్లు



టేకులపల్లి : చెట్టు విరిగి పడడంతో కూలిన ప్రహరీ




టేకులపల్లి : ఎగిరిపోయిన ఇంటిపైకప్పు రేకులు

తిరుమలాయపాలెం/టేకులపల్లి/కూసుమంచి, మే 14 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం అతలాకుతలం చేసింది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపోవడంతోపాటు ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడి తీగలు తెగిపోయాయి. తిరుమలాయపాలెం మండలం గోల్‌తండా, జింకలగూడెం, గోపాయిగూడెం, పాతర్లపాడులో ఈదురుగాలి బీభత్సం సృష్టించింది. గోపాయిగూడెం స్టేజీ సమీపంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై గాలిదుమారంతో ఒక్కసారిగా వర్షం కురవడంతో భారీ వృక్షాలు రోడ్డుపై కూలిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటలతరబడి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. చెట్లు కూలిన ప్రదేశానికి జేసీబీ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు, పోలీసులు గొడ్డళ్లతో చెట్ల కొమ్మలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, పెద్ద పెద్ద వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి.



తిరుమలాయపాలెం మండలం గోపాయిగూడెం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై కూలిన చెట్టు.. నిలిచిపోయిన వాహనాలు

గోల్‌తండా వద్ద రోడ్డుపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పాతర్లపాడు స్టేజీ నుంచి గోల్‌తండా మీదుగా జల్లేపల్లి, హైదర్‌సాయిపేట వరకు వాహనదారులు అవస్థలు పడ్డారు. రోడ్లపై పడిన చెట్లను ప్రజలు తొలగిస్తున్నారు. గాలిదుమారం బీభత్సానికి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. టేకులపల్లి మండలం బోడు, మొక్కంపాడుతండా, రామచంద్రునిపేట, కొప్పురాయి, బర్లగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో సాయంత్రం తీవ్రమైన గాలులు, ఉరుములతో వర్షం కురిసింది. మొక్కంపాడుతండాలో బానోత్ రవి ఇంటి ఆవరణలో ఉన్న వేప చెట్టు విరిగి ప్రహరీపై పడింది. అదే తండాకు చెందిన బానోత్ నరేశ్‌కు చెందిన ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. పలుచోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. కూసుమంచి మండలంలోని పలు ప్రాంతాల్లో 30 నిమిషాలపాటు వర్షం కురిసింది.



కూసుమంచిలో ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం



గోల్‌తండాలో నేలకొరిగిన స్తంభాలు, రహదారిపై విద్యుత్ తీగెలు



గోల్‌తండాలో రహదారిపై కూలిన చెట్లను తొలగిస్తున్న గ్రామస్తులు